


## పానుగంటి వెంకట రమణారావు

—————:o:—————

**నా** మిత్రబృందములో నొకడు, తన సినీమా అనుభవమును గురించి వ్రాసి నాకు పంపించెను. అది యిట్లుండెను:

ప్రస్తుత దినములలో, సినీమాలను జూడని వారుండరనియే నా నమ్మకము. అట్టి సినీమాలలో, చిత్ర విచిత్ర మహా చిత్రములు జరుగుచుండును. ఆ చీకటి భాగవతములను-ఆకన్ను కన్ను కలయికలను-ఆభుజము భుజము రాపుడులను-ఆ చేయి చేయి తాకుడులను-ఆ మూతి మూతి పొడిగింతలను-ఎప్పుడో ఒకప్పుడు, ప్రతివాడును అనుభవించియే యుండునని నాఅభిప్రాయము. సర్వ సాధారణముగ, పెద్ద పట్టణములలో, సాయంకాల మగునప్పటికి, స్త్రీ పురుషులు, అలవాటుచొప్పున సినీమాకు వెళ్ళకుండ నుండిన, కాఫీ త్రాగకపోయిన నెంత బాధగ నుండునో అంత బాధగ నుండును.


నేనొక దినమున సినీమాకు బోతిని. అక్కడ జనము కిలకిల మనుచుండిరి. Anglo Indians కూడ విచ్చేసిరి. దంపతు లిరువురును సర్వకాల సర్వావస్థలందును, ఒకరి నంటి యింకొక రుండవలె నను మతము వారగుటచే గాబోలు, మగవారందరును తమ తమ అర్ధాంగులను దీసికొని వచ్చి, తమ దగ్గఱనే కూర్చుండ బెట్టుకొనిరి. ఒకడు, తన మూడవ భార్యను వెంట బెట్టుకొని అంత జనమునుండి వచ్చుటలో, ఆమె పొరబాటున, యింకొకని చేయి పట్టుకొని లోనికి పోవుచుండుటచే గాబోలు, ఆతడు వాని చేయి విడిపించి తన చేతి నందించుచుండెను. "అమ్మాణీ! అమ్మాణీ! అటుగాదు-ఇటు-ఇటు-" అని యింకొకడు ఒక స్త్రీని వెనుకనుండి పట్టుకొనెను. ప్రక్కనున్న ఆమెభర్త ఆతని దౌడపై నొకటి తగిలించెను. ఎట్టులో నేను కొంచెము దారి చేసుకొని లోనికి బోతిని.

బొమ్మలు తెరపై ఆడ ప్రారంభించెను. "చెప్పు-చెప్పవేమి-చెప్పు-" అని నేలపై గూర్చుండిన కొందరు కేకలువేయ **Interpreter** చెప్ప మొదలిడుచుండగ, ముయ్యి—నోరు ముయ్యి" అని మరికొందరు కేకలువేయ ప్రా







రంభించిరి. వీధి భాగవతములో హాస్యగానిని
జూచుటకే కొందరు పోయినట్లు-సర్కసులో,
చెంపకాయల భాగవతమును జూచుటకు పోయి
నట్లు-తోలుబొమ్మలలో, గ్రంధాదిగానిని జూ
చుటకు పోయినట్లు-నాటకములో గ్రామఫోను
పాటలను వినుటకే పోయినట్లు యీ సినీమాల
లో **Interpreter** యొక్క చమత్కార సం
భాషణమును వినుటకై పోవువారు కొందరుం
దురు. సినీమాలో చాల చిత్రములను జూపిం
చిరి. నిచ్చెనలతోనైనను ఎక్కుటకసాధ్యమగు
గోడలను-కథా నాయకు డిట్టె-ఎక్కివేయుట-
కథా నాయకురాలు, మహా కష్టములలో నున్న
సమయమున-ఎక్కడనుండియో గాలిలోనుండి
ఊడిపడిన వానివలె-కథానాయకు డక్కడకు
తయారగుట-కథానాయకుడు యిండ్లపై సుల
భముగ నడచుట, మొదలగు అసంభవమగు-
అమానుష చర్యలను కొంతసేపు తెరపై జూ
పించిరి. అంత నాయకా నాయికలు, ఒకరి
మోముపై నింకొకరు మోముంచిరి. అట్టి
సమయమున, పరవశుడై నా ప్రక్క గూర్చుం

డీసవాడు-తన పడుచు భార్యకు పది ముద్దులను ప్రసాదించెను. "ఆ! ఆ! తప్పు-తప్పు" అని తుంటరి పిల్లలు కొందరు కేకలు వేయ ప్రారంభించిరి. తెరపై నాయకా, నాయికలు, భుజము భుజము కలుపుట యేమి-నా ప్రక్కనున్న నాయుడుగారు, తనతో తీసికొనివచ్చిన ఉంపుడుకత్తె యొక్క పైటను సర్దుట యేమి-అక్కడ వారిరువురును-పెదవి పెదవి కలుపుట యేమి-పావులా కుర్చీమీద గూర్చుండిన పాణకయ్యం గారు పరవశత్వమున గాబోలు ప్రక్కనున్న పాల్ఘాటు కాఫీహోటలున కధికారి పత్నిని గాంచి మెడను పొడిగించుట యేమి-అక్కడ వా రిరువురును తన్మయులై యుండు టేమి-ఒక **Anglo Indian, "Hallo! My Heart and Soul"** అని పరవశుడై, యింకొకని భార్య భుజమును బట్టుకొని తన దగ్గఱకు లాగుకొనుట యేమి అన్నియు ఒక్క సమయమున జరిగెను.

ఇంతలో—నెందుచేతనో, దీపములన్నియు వెలిగినవి. బొమ్మలు పడుతెరకూడ యెత్తబడెను. "**Dance-Dance**" అని కేకలు చెల









రేగినవి. "ఓహో! ఇదియా—విశేషము. ఇక్కడ నాట్యముగూడ నుండుటచేతనా, యింత జనమునకు కారణమయ్యెను. ఆహాహా! స్త్రీలకున్న ఆకర్షణ శక్తి యింతంత గాదు కద. గొఱుగుడు మీసముల వారెందరు గూడినను, Gas Light ఖర్చయినను రాకపోవుటచే, కొందరు ఒక రమణికి రంగులువేసి, రంగమెక్కించి ధనమతి సునాయాసముగా సంపాదింప గలుగుచున్నారు. కిల్లీల కొట్టుపై కోర మీసముల వాడు గూర్చుండు నంతకాలము, కాలణా కే కొదవయ్యెడిది కాని-కాంత కూర్చుండునప్పటి నుండి, కాసులకు కొదవలేకుండ నుండెడిది. ఈ రహస్యమును గనిపెట్టి కొందరు ధీమంతులు, స్త్రీలకు ధనమిచ్చి, తమ bus లో కూర్చుండబెట్టుకొని, ధనము సంపాదింప గలుగుచున్నారు. కాఫీ హోటలులో కులుకులాడి కాఫీ నందించిన కప్పు 5 కాసులనుండి, 6 కాసులవఱకు పెరిగినను, వెళ్లువారు మాత్రము తఱుగకుండ నున్నారే. స్త్రీల శక్తి యనిన జ్ఞాపకము వచ్చినది. మా గ్రంథాలయమునకు జనము వచ్చుటలేదు. Visitors Book అంతయు ఖాళీగా నున్నదని విచారముతో, ఒక గ్రంథాలయ కార్యదర్శిగారు, మేధాశక్తి సంపన్నులుగనుక, వారి కిదివఱకు పరిచయమున్న 15 వత్సరముల పడుచును, అక్కడ యిల్లు ఊడ్చుటకు లాంతరులను బాగుచేయుటకు—Carrom Board ఆడుటకు వచ్చినవారి దగ్గఱ నుండి దమ్మిడీ తీసికొనుటకు, మొదలైన పనులు జేయుటకై నియమించిరి. ఓ! ఆక్షణము నుండి ఆ ఊరంతయు గ్రంథాలయములో నుండిరి. నిరక్షర కుక్షులుగూడ చందాదారులుగ ప్రవేశించిరి. ఆహాహా! పొగడవలసి వచ్చినప్పుడు ఆ కార్యదర్శిగారి తెలివి తేటలనే పొగడవలెను" అని నాలో నే ననుకొంటిని.

ఇంతలో నాట్యమాడుచు ఒక స్త్రీ రంగమున ప్రవేశించెను. ఆమెను జూచి, నాప్రక్క నున్నవాడు కునికిపాట్లు పడుచుండిన తన స్నేహితుని "లే! ఇకలే—వచ్చినది" అని లేప ప్రారంభించెను. ఆమె యేదియో నాట్యము చేసెను. "ఆ నాట్యమున కిచ్చినానురా—నా నాలుగణాలును" అని ఒకడు—"ఏడ్చినావురా-నాట్యమునకు నే నివ్వలేదురా—దాని వక్షమున కిచ్చినానురా" అని యింకొకడు—"అమ్మయ్యా—దండుగ యనుకొంటినిగాని—గిట్టుబడియైనదిరా. ఓహో! ఏమివేషము—ఆ దీని తస్సాగొయ్య. ఆ! ఆ నడకరీవి యేమి—ఆవారచూపు యేమి" అని యిట్లు తన మనస్సులోని మమకారమును వెడల గ్రక్కువాడొకడు—"ఛా! కన్ను మెల్లయైనప్పుడు, వారచూపు యుండుట ఘనత కాదయ్యా! ఆ పిరుదల పసందును పరిశీలించినావురా" అని యింకొకడు—యిట్లు నానావిధముగ జెప్పుకొన ప్రారంభించిరి. "Non-sense—యిటువంటివి boycott చెయ్యవలెను" అని ఒక విద్యార్థి గంభీరముగ బలికి—ఆవలకు బోయి కిటికిలో నుండి రహస్యముగా పరీక్షింప మొదలిడెను. ఎట్టులో నాట్యము పూర్తియైనది. సినీమా మరల ప్రారంభమైనది. రెండు భాగము లైనప్పటికి, ఎందుచేతనో, దీపములన్నియు ఆరిపోయినవి. గాఢాంధకారము-ఎక్కడేమి జరుగుచున్నదో యేమియు తెలియదు. కిరసనాయిలు దీపమైనను లేదు. 'భద్రముగా గూర్చుంటివికాదూ !'

అని ఒకడు, తనభార్య యనుకొని, యింకొకని భార్య చేతిని తడుమ ప్రారంభించెను. ఎప్పటి కైనను దీపములు వెలుగునని, ఆశతో గూర్చుంటినిగాని, ప్రాణము విసిగి యింటికి బోతిని.

ఈ సినీమాలవలన మనలో చెప్పలేనంత మార్పు గలిగినది. "అరెరే! ఏమనుకున్నావు రా-జాగ్రత్త-ఎక్కడకు బోయెదవు. వచ్చుచున్నాను-కాచుకో-" అని తన చేతిలోనున్న కొరకంచును కత్తివలె పైకెత్తి-సినీమా నటకునివలె, ప్రక్కనున్న చిన్న మదురుగోడను దూకువారు కొందరు-అట్లు దూకుటలో-కాలును విఱుగగొట్టుకొనువారు కొందరు-"సఖీ! ప్రాణప్రియా! నిన్నువిడిచి నే నుండగలనా? అదిగో! నా ప్రాణప్రియ-ఇదిగో నా ప్రాణనాయిక-" అని యనుచు, మంచముకాళ్లను, తలగడలను, కౌగలించుకొనువారు కొందరు-"నేను Master Vithalని" అని తనపై పది యంగుళముల పొడవుగల వెంట్రుకలను పెంచువారు కొందరు-కథా నాయకుడు, కథా నాయికను, రహస్యముగా అర్ధరాత్రమున ఎత్తుకొని పోయినప్పుడు, నేను నాకు నచ్చినదానిని దొంగతనముగ ఎత్తుకొని పోవుటలో తప్పేమున్నదని, యేమెఱకవీధి మెల్ల కంటి దానినో, రాత్రి రాత్రి యెత్తుకొని పోవువారు కొందరు, "నేను హెరాల్లాయుడను" అని యనుచు, అద్దములు లేని కంటిజోడును దగిలించుకొని తిరుగువారు కొందరు-తమ తమ భార్యలకు, కండ్లకు జోడును తగిలించి, Bobbed Hair ను చేయించి డవాలీ పైటలను వేయించి, సినీమా Star వలె తయారుచేయువారు కొందరు. ఆడుపుట్టుకయగుటచే, అట్లు చేయుట కొందరి కిష్టము లేక పోయిన వారిపై ఆగ్రహించువారు మరికొందరు-యిట్లే, యెన్ని విధములుగనైన ప్రవర్తించుచున్నారు. సినీమాలవలన కొందరు బాగుపడుచున్నారనుట నిజమే. చోరుడు, ఏ ఏ సమయములందు యేయే టక్కరి వేషములను వేయవలయునో, దీనివలన తెలిసికొన గలుగుచున్నాడు—జారుడు, ఎప్పుడెప్పు డెట్లు నడచిన, తన పాచిక పడునో, అవి యన్నియు నేర్చుకొన గలుగుచున్నాడు—కనుక, యీ సినీమాలు, బుద్ధిమంతులకు కంటె బుద్ధిహీనుల కెక్కువ ఉపయోగకరమని, నా మిత్రు డొకడు చెప్పినమాట సత్యదూరము కాదేమో.

ఆతడు వ్రాసి పంపించిన వ్యాసమింతవఱకు మాత్రముండెను. ఈ విషయమును గురించి, విపులముగా ముందెప్పుడైనను వ్రాసెదను. ఇప్పు డిది చాలును.

సంక్రాంతికి కావలసిన పక్కని యుడుపులు, గుడ్డలు, పలువిధములైన స్వదేశీ సిల్కు చీరలు, జాకెట్టు రకములును

కేశవరామ్ అండ్ కంపెనీ,

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసున దొరకును. మంచి సరకులు! వెల సరసము!